జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం... ప్రజల కోసం
సిద్దిపేట
బుధవారం | 17 | జూన్ | 2026 | పేజీలు : 6

## రుద్రేశ్వరాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు



2 లో

# అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలి

## జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్ధిపేట , జూన్ 16 ,(ప్రజాజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. హైమావతి పిలుపు నిచ్చారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర పునః పరిశీలన కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం ప్రభుత్వ

మిగతా 2లో..



# మహిళ సంఘాల పైసలు గోల్మాల్

## ఎస్బీఐ ముందు ఆందోళన

చేర్యాల జూన్ 16(ప్రజాజ్యోతి): మహిళా పొదుపు సంఘాల ఖాతాల నుండి సుమారు కోటి రూపాయల నిధులు పక్కదారి పట్టిన సంచలన ఘటన చేర్యాల మండలం దానంపల్లి గ్రామంలో వెలుగులోకి వచ్చింది.బాధిత మహిళ సంఘాల మహిళలు తెలిపిన వివరాల ప్రకారం... దానంపల్లి గ్రామంలోని 23 మహిళా సంఘాల ఖాతాల్లో జమ కావాల్సిన దాదాపు కోటి రూపాయల నిధులను, గ్రూపు సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా, సంఘాలతో సంబంధం లేని ఇతర వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించారనీ ఆరోపించారు.ఈ విషయం తెలుసుకున్న బాధిత మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం

మిగతా 2లో..



2 లో

# రైతుల కన్నీళ్లపై కాంగ్రెస్ పాలన సాగుతోంది



అర్హత కలిగిన ప్రతి పౌరుడు

## ఓటరుగా నమోదు కావాలి

మొదటి పేజీ తరువాయి..

నిర్వహించిన 2కే రన్ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వే నిర్వహించే బీఎల్వోలు, ఓటరు నమోదు అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కాలంలో ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.అనంతరం జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన సైక్లింగ్ క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో సదానందం, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల పైసలు గోల్మాల్

మొదటి పేజీ తరువాయి..




చేర్యాలలోని ఎస్బీఐ బ్యాంకు ముందు భారీ ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ బ్యాంకు ఎదుట బైఠాయించారు.ఈ నిధుల గోల్మాల్ వెనుక దానంపల్లి గ్రామ సీఏ లింగాల మమతతో పాటు మరికొందరి హస్తం ఉందని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధ్యులపై తక్షణమే కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ జరిపి తమ డబ్బులు తమకు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

## రుద్రేశ్వరాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

కొండపాక జూన్ 16 (ప్రజా జ్యోతి );-కొండపాక లోని ప్రసిద్ధి చెందిన అతి పురాతనమైన రుద్రేశ్వరాలయాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి మంగళవారం సాయంత్రం సందర్శించారు. రుద్రేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఆలయ నిర్వాహకులు కలెక్టర్ ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. రుద్రేశ్వరాలయ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనంతుల శ్యామ్ మోహన్ ట్రస్ట్ సభ్యుడు ఆర్ బాలయ్య తదితరులున్నారు.

# గ్రామ ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలి

### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

చేర్యాల, జూన్ 16 (ప్రజాజ్యోతి): చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామం లో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం చేశారు.పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పోతిరెడ్డిపల్లి గ్రామ ప్రజలందరికీ ఆ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరారు. గ్రామమంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని, అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ నిలిచివుండాలని ఆయన కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక



ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బంగారం మెరిపిస్తామని మోసం చేసిన కేటుగాళ్ల అరెస్ట్

### తొగుట ఎస్సై, సిబ్బందిని అభినందించిన పోలీస్ ఉన్నతాధికారులు

తొగుట, జూన్ 16 (ప్రజాజ్యోతి): తొగుట మండలంలో ఇటీవల బంగారం మెరిపిస్తామని మాయ మాటలు చెప్పి ఎనిమిది గ్రాముల బంగారం కాజేసిన కేటుగాళ్లను తొగుట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండు తరలించారు. తొగుట పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటరావుపేట్ గ్రామంలో మహిళ వద్ద నుండి బంగారు పుస్తెళతాడు కడిగి మెరిపిస్తామని చెప్పి మోసం చేసిన కేసును ఎంతో ప్రతిస్తాత్మకంగా తీసుకున్న తొగుట ఎస్సై వి. రవికాంత్ రావు రెండు బృందాలుగా ఏర్పడి కేసును చేదించే క్రమంలో సోమవారం సాయంత్రం మెట్టు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనీఖి చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని తొగుట ఎస్సై వి. రవికాంత్ రావు అదుపులోకి తీసుకొని విచారించగా కూలీ పనులు చేసుకుంటూ జీవించే బీహార్ రాష్టం మధురాపూర్ గ్రామానికి చెందిన 49 సంవత్సరాల మహమ్మద్ రుస్తుం, నారాయణపూర్ గ్రామానికి చెందిన 41 సంవత్సరాల మహమ్మద్ గ్యాస్ అలీ ఇద్దరూ కలిసి సిద్దిపేట జిల్లా తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామానికి వచ్చి గత శనివారం ఉదయం గ్రామంలోని ఒక అమ్మాయి మెడలో పుస్తెలతాడును కొత్త వాటిలాగే మెరిపిస్తామని ఆమెకు మాయ మాటలు చెప్పి ఆమె పుస్తెలతాడు తీసుకొని వారి వెంట తీసుకువచ్చిన గిన్నెలో లిక్విడ్ ను పోసి పుస్తెల తాడును అందులో



ముంచి క్లీన్ చేసి కొద్దిగా బంగారాన్ని అందులో కరిగేటట్టుగా చేసి తిరిగి ఆమె తాళిబొట్టు ఆమెకు ఇచ్చేసినట్లు తాము చేసిన నేరాన్ని ఒప్పుకున్నారని విచారణ అనంతరం నిందితులను అరెస్ట్ చేసి జుడిషియల్ రిమాండ్ కి తరలించనట్లు తెలిపారు. కేసు చేధనలో ముఖ్యపాత్ర వహించిన తొగుట ఎస్సై వి. రవికాంత్ రావు, తొగుట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య, పిసి లు భాను, నాగరాజు, ఉమ లను పోలీస్ ఉన్నతాదికారులు అభినందించారు. ఈ సందర్భం గా తొగుట ఎస్సై మాట్లాడుతూ గ్రామలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చి ఇలా మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసే ప్రమాదం ఉన్నందున ప్రజలు అలాంటి వ్యక్తులని నమ్మవద్దని ఎవరైనా అలా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, లేదా డయల్ 100 కాల్ కి ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

# రైతుల కన్నీళ్లపై కాంగ్రెస్ పాలన సాగుతోంది

### జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

చేర్యాల, జూన్ 16 (ప్రజాజ్యోతి):రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రైతుల కన్నీళ్లపై సాగుతోందని, వడ్ల కొనుగోళ్లలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.చేర్యాల పట్టణ కేంద్రంలోని రేణుక గార్డెన్లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైతాంగ సమస్యలు, ఎన్నికల సంఘం చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియ, బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

#### వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం.. రైతుల అగచాట్లు

సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... గత రెండు నెలలుగా రాష్ట్రంలోని రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత, ధాన్యం తరలింపునకు లారీల లభ్యత లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.లారీలు రాకపోవడంతో రైతులు సొంతంగా ట్రాక్టర్లలో ధాన్యాన్ని తరలించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో యూరియా, విత్తనాలు అందించడమే కాకుండా.. వానాకాలానికి ముందే ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టి రైతులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. పంట చేతికొచ్చిన తర్వాత కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించిన ఘనత బీఆర్ఎస్దేనన్నారు.

#### ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్ర!

జూన్ 25 నుంచి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ పేరుతో ఓట్ల తొలగింపునకు పెద్ద కుట్ర జరుగుతోందని పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు.ఎన్నికల సంఘం బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపు ప్రక్రియ సాగుతోందని,ముఖ్యంగా ముస్లిం లు, వలస కార్మికులు, గ్రామాల్లో ఓటు హక్కు కలిగి ఉండి పట్టణాల్లో నివసిస్తున్న వారి ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్నారు.ఈ డిజిటల్ విధానంలో జరిగే ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతి బూత్లో ఇద్దరు చొప్పున క్రియాశీలక కార్యకర్తలను గుర్తించి, వారికి సభ్యత్వ నమోదు, ఓటర్ల జాబితా పరిశీలనపై పూర్తిస్థాయి శిక్షణ అందిస్తామని తెలిపారు.

#### సభ్యత్వ నమోదును ఉద్యమంలా విజయవంతం చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు



కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.పార్టీపై ప్రేమ ఉన్న ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసి ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా విజయవంతం చేయాలన్నారు.కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా చేర్యాల ప్రాంతంలో గులాబీ జెండా ఎగిరిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భువనగిరి ఎంపీ ఛామల కిరణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



కొమురవెల్లి, జూన్ 16 (ప్రజాజ్యోతి):- జనగామ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సమస్యలు, పార్టీ బలోపేతం, ప్రజా సంక్షేమ అంశాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజ మల్లేశం, కొమురవెల్లి మండల పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, చేర్యాల పట్టణ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, దుబ్బ తండా సర్పంచ్ పాల్య రమేష్, మద్దూర్ మండల నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ ఛామల కిరణ్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు.

## మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపాక జూన్ 16 ,(ప్రజాజోతి):-కొండపాక మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్తు మరమ్మతుల కారణంగా వారం రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సత్యం తెలిపారు. విద్యుత్ వైర్లకు తాకుతున్న కొమ్మలను తొలగించడం కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లో మరమ్మత్తులు జరిగే సమయాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాల అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు అందుకు సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



సిద్దిపేట రూరల్, జూన్ 16 , (ప్రజాజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు, మెదక్ విభాగ్ కన్వీనర్ సావుల ఆదిత్య డిమాండ్ చేశారు. ఏబీవీపీ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి శాస్త్రికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం కాకుండా మెరుగైన మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాలని కోరారు.విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి తరుణ్, సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ

### గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా

### రోటరీ క్లబ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

ములుగు,జూన్16(ప్రజా జ్యోతి)గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే రోటరీ క్లబ్ ముఖ్య ఉద్దేశం అని గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.మంగళవారం మండల కేంద్రమైన ములుగులో మహిళలకు3150 అసిస్టెంట్ గవర్నర్ జగదీశ్వర్ తో కలిసి కుట్టు మిషన్ల పంపిణీ చేశారు.మహిళల ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు తోడ్పాటు అందించాలన్న ఉద్దేశంతోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,ఇందులో భాగంగానే ములుగు గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలకు షార్ సహకారంతో క్లబ్బుకు కేటాయించిన కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్లు వారు వివరించారు.రోటరీ ఇంటర్నేషనల్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా వ్యవహరిస్తుందన్నారు. గతంలో విద్యార్థినిలకు పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్న వారికి సైకిల్లు,పాఠశాలల్లో బెంచీలు,మధ్యాహ్న భోజనానికి ప్లేట్లు,డ్రెస్సులు,నోటు పుస్తకాలు,గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు స్వచ్ఛమైన నీరును అందించడానికి




నీటి శుద్ధి ఫిల్టర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి సాయి రెడ్డి,పూర్వ అధ్యక్షులు,నరసింహారెడ్డి,క్లబ్ చైర్మన్ కరుణాకర్ రెడ్డి,సభ్యులు శ్రీరాములు,శ్రీనివాస్ రెడ్డి,నరేందర్ రెడ్డి,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



### రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచన

### యాప్ ద్వారా యూరియా పంపిణీ ప్రారంభం

మిరుదొడ్డి, జూన్ 16, (ప్రజా జ్యోతి ) : ఫర్టిలైజర్ షాపు యజమానులు నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే చర్యలు తప్పవని అక్బర్ పేట భూంపల్లి మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్ హెచ్చరించారు. మంగళవారం ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా మండల కేంద్రంలోని విత్తన డీలర్ల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి బి. సత్యాన్వేష్ ఆధ్వర్యంలో, పోలీసు శాఖ సహకారంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో నిల్వ ఉంచిన విత్తనాలు, పురుగుమందులు, విక్రయ రికార్డులు, బిల్లులను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా డీలర్లకు నకిలీ విత్తనాలను విక్రయించవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు అమ్మకాలు చేపట్టవద్దని మండల వ్యవసాయ అధికారి హెచ్చరించారు. అలాగే కాలం చెల్లిన పురుగుమందులు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతులకు విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు అందించాలని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సన్న రకాల విత్తనాలను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పిస్తూ, యూరియా పంపిణీలో పారదర్శకత తీసుకురావడం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యూరియా యాప్ ద్వారా పంపిణీ ప్రక్రియను మండలంలో ప్రారంభించినట్లు తెలిపారు. నిన్నటి నుంచి యాప్ ఆధారిత యూరియా పంపిణీ అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. రైతులు ముందుగా తమ సాగు భూముల పూర్తి వివరాలను యాప్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేసుకోవాలని, అనంతరం యూరియా కోసం బుకింగ్ చేసుకోవచ్చని వివరించారు. యాప్ ద్వారా ఎరువుల పంపిణీ జరగడం వల్ల రైతులకు సకాలంలో, పారదర్శకంగా యూరియా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. యూరియా బుకింగ్, నమోదు ప్రక్రియలో రైతులకు సహకరించేందుకు వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని చెప్పారు.రైతులు నకిలీ విత్తనాలు, అధిక ధరలకు అమ్మకాలు, బిల్లులు ఇవ్వకపోవడం వంటి అంశాలు గమనించినట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## క్రీడా హబ్ భూమిని యువజన, క్రీడల శాఖకు బదిలీ చేయాలి

### ఆర్డీవోకు వినతిపత్రం

గజ్వేల్, జూన్16(ప్రజా జ్యోతి): క్రీడా హబ్ భూమిని యువజన, క్రీడల శాఖకు బదిలీ చేసి గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సి. సంతోష్ గజ్వేల్ ఆర్డీవో చంద్రకళను కోరారు. మంగళవారం గజ్వేల్లో అన్ని క్రీడా సంఘాల ప్రతినిధులు ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ...గత ప్రభుత్వం గజ్వేల్లో క్రీడా హబ్ నిర్మాణం కోసం సర్వే నంబర్ 560/16లో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిందన్నారు. ఆ భూమిని యువజన, క్రీడల శాఖ పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసే ప్రక్రియ సంబంధిత శాఖల సమన్వయ లోపంతో



ఆలస్యమవుతోందన్నారు. క్రీడా హబ్ను త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామీణ యువత క్రీడల్లో రాణించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరిచంద్ర ప్రసాద్, శివ, రాజు, కనకయ్య, ఇలియాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య



కొండపాక జూన్ 16 (ప్రజా జోతి): ఇంట్లో ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాకలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కొండపాకకు చెందిన మేడిపల్లి రాజు 32 తల్లిదండ్రు లతో నివసిస్తున్నాడు. రోజువారిగా రాత్రికి ఒకే చోట పడుకున్నారు. రాత్రి అందరు పడుకున్న సమయంలో ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. కుక్కునూరు పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష

కొండపాక. జూన్ 16 (ప్రజా జ్యోతి):- అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, ₹11,500 జరిమానా విధిస్తూ సిద్దిపేట ఒకటవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కుమారి తరుణి మంగళవారం తీర్పునిచ్చారు.కరీంనగర్ జిల్లా విద్యానగర్కు చెందిన ధరావత్ వెంకన్నపై 2014లో కూకునూరుపల్లి పి.ఎస్ లో రోడ్డు ప్రమాదం కేసు (క్రైమ్ నెం. 139/2014) నమోదైంది. కోర్టులో నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ నిందితుడికి సెక్షన్ 304(అ) కింద 2 ఏళ్లు, సెక్షన్ 338 కింద ఏడాది, సెక్షన్ 337 కింద 3 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.ఈ పాత కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన ఎపిపి లు తిరుపతి, లావణ్య, ఎస్ఐలు రంగకృష్ణ, పి. శ్రీనివాస్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి, సిడిఓ రాజులను ఉన్నతాధికారులు అభినందించారు.

## కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట, జూన్ 16,(ప్రజాజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు ల్యాబ్ టెక్నీషియన్ , ఒకటి సీనియర్ ట్యూబర్క్యులోసిస్ ల్యాబొరేటరీ సూపర్వైజర్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు.అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు వివరాలు, నిబంధనలు మరియు దరఖాస్తు నమూనా కోసం జిల్లా అధికారిక వెబ్సైట్ను పరిశీలించాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 17 నుండి జూన్ 19 సాయంత్రం 5 గంటలలోపు సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

## పాఠశాల బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

### ఎంవీఐ మోహన్




గజ్వేల్, జూన్ 16 (ప్రజా జ్యోతి): పాఠశాల బస్సులు తప్పనిసరిగా ఫిట్నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని గజ్వేల్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ) మోహన్ తెలిపారు.వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి, కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.గత రెండు రోజులుగా చేపట్టిన తనిఖీల్లో సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు ఏడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. పాఠశాలయాజమాన్యాలు బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్, డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండేలా చూడాలని సూచించారు. అలాగే బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు వంటి భద్రతా సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, సరైన పత్రాలు, ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ మోహన్ హెచ్చరించారు.

# కనీస వేతనం 26 వేలు పెంచాలి



### సిఐటియూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్ జూన్ 16(ప్రజా జ్యోతి): కనీస వేతనం 26 వేలు పెంచాలని,లేబర్ కోడులు రద్దు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈనెల 21న సంగారెడ్డి పట్టణంలో నాన్ ఫర్ మెంట్ కార్మికుల రాష్ట్ర మొదటి మహాసభ విజయవంతం చెయ్యాలి. గజ్వేల్ పట్టణంలో గోడపత్రిక ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో నెంబర్ 6ను కార్మికుల వేతనాలను పెంచుతూ విడుదల చేయడం జరిగింది. వేతనాల పెంపుదల అశాస్త్రీయ పద్ధతిలో ఉందని డాక్టర్ ఆక్రాయిడ్ ఫార్ములా,1951 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ పద్ధతులను అవలంబించలేదని అన్నారు.కనీస పరమైన జీవన ప్రమాణాలను పరిగణ తీసుకోలేదని విమర్శించారు. వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో నూతన లేబర్ కోడలను అమలు చేయవద్దని కార్మికుల వ్యతిరేకంగా ఉన్న కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన కార్మిక కోడులను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం కార్మికులకు ద్రోహం చేయడమేనని అన్నారు.పరిశ్రమల్లో ఇప్పటికే కనీస వేతనాలు, చటపరమైన సౌకర్యాలు అమలుకు నోచుకోవడం లేదని,కాంట్రాక్టు, నిమ్స్, న్యాప్స్, స్టాపు, ఫిక్స్డ్ టైం, తదితర రూపాల్లో పరిశ్రమంలో కార్మికులను నియమించుకొని చట్టాలను ఉల్లంఘించి పని చేయించడం జరుగుతుందని కార్మికుల భద్రతను వదిలేశారన్నారు.పర్మినెంట్ గాని కార్మికులందరికీ కోసం సౌకర్యాలు అమలు కోసం తెలంగాణ రాష్ట్ర నాన్ ఫర్ మెంట్ వర్కర్స్ యూనియన్ పోరాటం నిర్వహిస్తుందని తెలిపారు.21న సంగారెడ్డి పట్టణంలో జరుగు రాష్ట్ర ప్రథమ మహాసభలో సిఐటియు కేంద్ర, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వేణుగోపాల్ బండ్ల స్వామి చంద్రశేఖర్ రెడ్డి రంగారెడ్డి రాజగోపాల్ వెంకట్రావు పాల్గొన్నారు.

# పల్లె బిడ్డల ఉన్నత విద్యా కలలకు ప్రభుత్వం అండగా



### యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ఉచిత శిక్షణ స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత

మిరుదొడ్డి, జూన్ 16, (ప్రజా జ్యోతి ): గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన బాలికలు కూడా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమం ద్వారా కేజీబీవీ విద్యార్థినులకు ఉచితంగా నాణ్యమైన కోచింగ్, హాస్టల్ సౌకర్యాలు కల్పిస్తూ ఐఐటీ, నీట్, క్లాట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత బాలికల్లో ప్రతిభకు కొదవ లేదని, సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందితే దేశవ్యాప్తంగా అత్యున్నత స్థాయిలో రాణించగల సామర్థ్యం వారిలో ఉందన్నారు. యంగ్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమం విద్యార్థినుల జీవితాలను మలుపుతిప్పే అవకాశంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పైలట్ ప్రాజెక్టు భాగంగా ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలోని ఎంపిక చేసిన కేజీబీవీలలో ప్రత్యేక కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. కేజీబీవీ నర్మెటలో ఐఐటీ కోచింగ్కు ఇరవై సీట్లు, కేజీబీవీ రాఘవాపూర్లో నీట్ మెడికల్ కోచింగ్కు ఇరవై సీట్లు, కేజీబీవీ మిరుదొడ్డిలో క్లాట్ లా కోచింగ్కు ఇరవై సీట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థినులకు ఉచిత ట్యూషన్, అధ్యయన సామగ్రి, ప్రత్యేక హాస్టల్ వసతి తదితర సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. సిద్దిపేట జిల్లాలోని 23 కేజీబీవీలలో 6వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, ప్రవేశ పరీక్ష జూలై 12న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన, ఆసక్తి ఉన్న విద్యార్థినులు వెంటనే తమ సంబంధిత కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని స్వర్ణలత సూచించారు. గ్రామీణ బాలికలకు ఉన్నత విద్యా అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నం విద్యారంగంలో కొత్త దిశను చూపుతుందని ఆమె పేర్కొన్నారు.



## ఉపాధ్యాయుల డైరీ ఆవిష్కరించిన

### మండల విద్యాధికారి గజ్జల కనకరాజు



దౌల్తాబాద్, జూన్ 16: ( ప్రజా జ్యోతి) తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల డైరీ ఆవిష్కరించిన మండల విద్యాధికారి గజ్జల కనకరాజు. మంగళవారం మండల వనరుల కేంద్రంలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక శాస్త్ర పోరం ప్రప్రథమంగా ఉపాధ్యాయుల టీచింగ్ డైరీని రూపొందించారని, ఈ డైరీ ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తుందని, ఇతర సబ్జెక్టుల ఫోరం వారికి ఈ డైరీ మార్గదర్శనమని కొనియాడారు. దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాసిత్, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఫోరం ఉపాధ్యాయులు రూపొందించిన డైరీని పరిశీలించి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు అవసరమైన విధంగా డైరీని రూపొందించారని ఈ డైరీలో అకాడమిక్ స్టాండరడ్స్ , పాఠ్యప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు పొందుపరచడం బాగుందని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్ రెడ్డి, సత్య నారాయణ, జంపన్న,రవీందర్, దశరథం,రాజు, మహేశ్వరి, రమాదేవి , ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు.

## చేర్యాలలో 19న మెగా రక్తదాన శిబిరం

### మాజీ ఎంపీపీ డాక్టర్ ఆర్. పరమేశ్వర్



చేర్యాల జూన్16(ప్రజాజ్యోతి):ఈ నెల 19న(శుక్రవారం)చేర్యాల పట్టణంలోని అక్షయ హాస్పిటల్లో భారీ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అక్షయ ఆసుపత్రి అధినేత, మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని దానాల కంటే రక్తదానం, అవయవదానం అత్యంత పవిత్రమైనవని పేర్కొన్నారు. మానవ శరీరంలో 120 రోజుల తర్వాత రక్తకణాలు సహజంగానే నశిస్తాయని, ఆ రక్తాన్ని అవసరమైన వారికి దానం చేయడం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడవచ్చని ఆయన వివరించారు. 18 నుండి 65 సంవత్సరాల వయస్సు ఉండి, కనీసం 45 కిలోల బరువు ఉన్న ఆరోగ్యవంతమైన వ్యక్తులు ఎవరైనా రక్తదానం చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేర్యాల సీఐ బానోత్ రమేష్ నాయక్ హాజరుకానున్నట్లు తెలిపారు.న్యూ మలక్పేట్ హైదరాబాద్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి పిన్న రమేష్ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో రక్తదానం చేసిన వారికి ఉచితంగా అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి, ఆ రిపోర్టులను అదే రోజు సాయంత్రం లోపు వాట్సప్ ద్వారా అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా, రక్తదాతలకు ప్రత్యేక సర్టిఫికేట్తో పాటు భవిష్యత్తులో వారికి ఎక్కడ,ఎప్పుడు రక్తం అవసరమైనా ఎలాంటి ఛార్జీలు లేకుండా ఉచితంగా రక్తాన్ని సరఫరా చేస్తామని రమేష్ హామీ ఇచ్చారు.చేర్యాల పరిసర ప్రాంతాల యువకులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో చిట్యాల, లెనిన్ నగర్ సర్పంచ్లు జానకి కృష్ణలీల స్వామి, దాసరి పరశురాములు, డాక్టర్ రామగళ్ళ భూవన్ చతుర్వేది, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి పిన్న రమేష్, గూడ నాగ శేఖర్ రెడ్డి, ఉప్పల రాములు, బసవగళ్ళ రమేష్, ర్యాకం ప్రభాకర్, గదరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యమే నా ప్రాధాన్యత



### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

### చేర్యాలలో రూ.11.66 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేర్యాల జూన్ 16(ప్రజాజ్యోతి):పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం చేర్యాలలోని రేణుక గార్డెన్లో నిర్వహించిన కార్యక్రమంలో.. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు రూ.11.66 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన నియోజకవర్గంగా జనగామ నిలిచిందని తెలిపారు. డిసెంబర్ 2023 నుండి నీలిమ హాస్పిటల్ ద్వారా వేలాది మంది నిరుపేదలకు నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు ఆరోగ్య సమస్యలు వస్తే ముందుగా ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని సూచించారు. అవసరమైన పరిస్థితుల్లో తమ నీలిమ హాస్పిటల్ సేవలను వాడుకోవచ్చని సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ,వైస్ చైర్ పర్సన్ ,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,నాలుగు మండలాల బీఆర్ఎస్ నాయకులు,లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి సేవలు మరువలేనివి



### సర్పంచ్,ఉప సర్పంచ్ కృష్ణ,రాంచంద్రం

గజ్వేల్ జూన్ 16 (ప్రజా జ్యోతి): దౌలాపూర్ గ్రామ సభ్యుడిగా ప్రజలతో మమేకమై గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి సతీష్ సేవలు మరువ లేనివని సర్పంచ్,ఉప సర్పంచ్ కృష్ణ,రాంచంద్రం అన్నారు.జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్తిష్ బదిలీ పై గజ్వేల్ మండల పరిధిలోని బెజగామా గ్రామానికి వెళ్ళనున్నారు.జగదేవపూర్ మండల పరిధిలోని లింగారెడ్డి పల్లి గ్రామం నుండి బదిలీపైనూతనొగా వచ్చిన దౌలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఐలేని గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్ పాలకవర్గ సభ్యులు వివిధ పార్టీల గ్రామ ముఖ్య నాయకులు సాదరంగా ఆహ్వానించారు.పంచాయతీ కార్యదర్శులను స్థానిక సర్పంచ్ కుకునూరి కృష్ణ ఉప సర్పంచ్ పోకల రాంచంద్రం,మాజీ ఎంపిటిసి కొన్నే జయమ్మ అధికారులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌలాపూర్ గ్రామానికి పంచాయతీ కార్యదర్శి సత్తిష్ ఆయన సేవలు మరువలేనివని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను వెంటనే స్పందించి పరిష్కారం చేసేవారు.వారు ఎక్కడికి వెళ్లిన మంచి పేరు ప్రఖ్యాతలు పొందాలని కోరారు.అదేవిధంగా నూతనంగా బదిలీ పై గ్రామానికి వచ్చిన పంచాయతీ కార్యదర్శి ఐల్లేని ప్రజల పట్ల ప్రేమ ఆప్యాయత ఉండి ప్రజల మెప్పు



పొందాలన్నారు.ప్రజల సమస్యలు వెంటనే స్పందించి పరిష్కారం చేసే విధంగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు జూపల్లి మధు, బంగారి,మర్రికింది మహేష్ గౌడ్,ఆకారం పెద్ద నర్సింలు,కాదుర్ల అనిత కనకయ్య,గోదాల లావణ్య భాస్కర్ రెడ్డి, అనేమైన పోచమ్మ బాల్ రాజు,గ్రామస్తులు మచ్చేందర్ రెడ్డి,కొన్నే స్వామి,సిద్దులు,అయిత బాల్ రాజు,శివారెడ్డి ఇరమైన మైసయ్య రాగుల చంద్రయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



సిద్దిపేట రూరల్ , జూన్ 16,(ప్రజాజ్యోతి):గ్రామాల అభివృద్ధికి ఉప సర్పంచ్ల ఫోరం సమిష్టిగా పనిచేసి ఆదర్శ గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సూచించారు. నూతనంగా ఎన్నికైన నారాయణరావుపేట మండల ఉప సర్పంచ్ల ఫోరం సభ్యులు సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి అభినందించిన హరీష్ రావు, ఫోరం ఏకగ్రీవ ఎన్నిక అభినందనీయమన్నారు. సిద్దిపేట నియోజకవర్గం అభివృద్ధిలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, అదే స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు నవీన్, ఫోరం సభ్యులు, మాజీ ఎంపీపీ బాలమల్లు, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, కొనయ్యగారి ఎల్లయ్య, మాజీ సర్పంచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## దివ్యాంగుల సమస్యలపై స్పందించాలి

సిద్దిపేట రూరల్ , జూన్ 16,(ప్రజాజ్యోతి): తెలంగాణలో దివ్యాంగులకు జరుగుతున్న అన్యాయాలపై బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం అధ్యక్షులు కెమ్మసారం అశోక్ డిమాండ్ చేశారు. దివ్యాంగుల పెన్షన్లు, సంక్షేమ పథకాల అంశాలపై బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో విఫలమయ్యారని విమర్శించారు. దివ్యాంగుల హక్కుల కోసం చొరవ చూపాలని, లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో దివ్యాంగులు తమ నిర్ణయాన్ని వెల్లడిస్తారని హెచ్చరించారు.

## అతివేగం బలితీసుకున్న ఇద్దరి ప్రాణాలు



గజ్వేల్, జూన్ 16(ప్రజా జ్యోతి):గజ్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరారం గ్రామం వర్గల్ కమాన్ వద్ద మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. రూరల్ సీఐ రవి రాజు తెలిపిన వివరాల ప్రకారం, సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ముందుగా వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పిన ఆటో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న కాయితి సత్తయ్య (42)ను ఢీకొట్టి ఆటో, కారు రెండూ పల్టీలు కొట్టాయి.ఈ ప్రమాదంలో కాయితి సత్తయ్యతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న కొరిమి లక్ష్మి (45) అక్కడికక్కడే మృతి చెందారు.ఆటో డ్రైవర్ కొరిమి శ్రీనివాస్, అతని కుమార్తెతో పాటు కారులోని ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ కట్కూరి అశ్వో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# మహిళా సాధికారతకు టైలరింగ్ శిక్షణ

### హ్యాండ్ ఆఫ్ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తబిత జయపాల్ రెడ్డి




గజ్వేల్ జూన్ 16(ప్రజా జ్యోతి): స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం, మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడం లక్ష్యంగా హ్యాండ్ ఆఫ్ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా నిర్వహించిన టైలరింగ్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా హ్యాండ్ ఆఫ్ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తబిత జయపాల్ రెడ్డి మాట్లాడుతూ...టైలరింగ్ శిక్షణా గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో శిక్షణ పొందిన 10 మంది మహిళలు సర్టిఫికెట్లు అందుకుని గ్రాడ్యుయేట్ అయ్యారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు తమ అనుభవాలను పంచుకుంటూ, ఈ కోర్సు ద్వారా కుట్టు నైపుణ్యాలను మెరుగుపరుచుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఆత్మవిశ్వాసం పెరిగిందని తెలిపారు.మూడు నెలల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో కుట్టు విద్యకు సంబంధించిన పలు అంశాలను నేర్చుకుని, చిన్న స్థాయి వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా ఈ శిక్షణ ఉపయోగపడిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ పాస్టర్ యాకోబు,కోఆర్డినేటర్ కిస్టఫర్, శిక్షకరాలు వాణి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బుద్ద నాగరాజు,ఉప సర్పంచ్ గణేష్, మాజీ ఎంపీటీసీ కవిత శ్రీనివాస్ రెడ్డి,వార్డు సభ్యులు శ్రీనివాస్, స్థానిక ఫీల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి




### నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందించాలి
### విద్యతోపాటు క్రమశిక్షణ కలిగి ఉంటేనే భవిష్యత్తులో మంచి మార్గం
### విద్యార్థులకు దుస్తుల పంపిణీ
### తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్

దుబ్బాక ప్రతినిధి , జూన్ 16( ప్రజా జ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువు చదివి తమ లక్ష్యాన్ని సాధించినప్పుడే చదువు నేర్పిన గురువుకు చదివించిన తల్లిదండ్రులకు గొప్ప పేరు వస్తుందని సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రోజున తిమ్మాపూర్ జడ్పీ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ..... విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైందని ఈ దశలో ఏర్పడే క్రమశిక్షణ పట్టుదల లక్ష్యసాధన భవిష్యత్తులో విజయాలకు పునాదినిస్తాయన్నారు. విద్యార్థులు మంచిగా చదివుకొని చదువు చెప్పిన గురువులకు, చదివిపించిన తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. పెంటయ్య , సీనియర్ అసిస్టెంట్ టి .మల్లారెడ్డి, ఉపాధ్యాయులు సిహెచ్ గోపాల్ రెడ్డి , రవీందర్ , కవిత



విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా అనంతరం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని విద్యార్థి విద్యార్థులకు కౌన్సిలర్ లు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.